క్లుప్తంగా

పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలి



చిన్నారికి అన్నప్రాసన చేస్తున్న మహాదేవ్‌గౌడ్

కొండపాక(గజ్వేల్): అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్‌ల ఫోరం జిల్లా అధ్యక్షుడు ఆరెపల్లి మహాదేవ్‌గౌడ్ పేర్కొన్నారు. దశాబ్ది ఉత్సవాల నిర్వహణలో భాగంగా బుధవారం మండల పరిధిలోని దుద్దెడలో గల అంగన్‌వాడీ 3వ కేంద్రంలో గర్భిణులకు సీమంతాలు, పిల్లలకు అన్నప్రాసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరెపల్లి మహాదేవ్‌గౌడ్ మాట్లాడుతూ.. పౌష్టికాహారం లోపం ఉండకుండా ప్రభుత్వం చూస్తుందన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా అన్ని శాఖల ఉద్యోగుల సమక్షంలో సంబరాలను జరుపుతుందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ శోభారాణి, తల్లులు, గర్భిణులు తదితరులు పాల్గొన్నారు.

బీటీరోడ్ల నిర్మాణానికి భూమిపూజ



పనులను ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని కస్తూరిపల్లిలో బుధవారం బీటీరోడ్ల నిర్మాణానికి ఎంపీపీ మాణిక్యరెడ్డి భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో గొర్రెల పెంపకందారుల సహకార సంఘం జిల్లా చైర్మన్ శ్రీహరియాదవ్, ఏఎంసీ వైస్ చైర్మన్ కుంటయ్య, సర్పంచ్‌లు ఉమేశ్‌చంద్ర, పద్మస్వామి, ఐలయ్య, ఎంపీటీసీలు శ్రీనివాస్, పద్మమల్లేశంగౌడ్, నాయకులు మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సిద్దిపేటలో..



పనులను ప్రారంభిస్తున్న మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు, కౌన్సిలర్ విజేందర్‌రెడ్డి

సిద్దిపేటకమాన్: సిద్దిపేట మున్సిపల్ పరిధిలోని ఒకటో వార్డు లింగారెడ్డిపల్లి కాలనీ నుంచి రాజీవ్ రహదారి వరకు సుమారు 2కిలోమీటర్లు నిర్మించనున్న బీటీరోడ్డు పనులను వార్డు కౌన్సిలర్ విజేందర్‌రెడ్డితో కలిసి మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఊరూర చెరువుల పండగ నిర్వహించాలి



మాట్లాడుతున్న ఎంపీపీ మానస

హుస్నాబాద్‌రూరల్: ఊరూర చెరువుల పండగ జరపాలని ఎంపీపీ లకావత్ మానస అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు, ప్రజాప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేసి చెరువుల పండగపై చర్చించారు. గ్రామాల్లో చెరువు కట్ట మైసమ్మకు పూజలు చేసి ఊరందరికీ భోజనాలు పెట్టించాలని చెప్పారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ముందు ఉండి వేడుకలను ఘనంగా జరిపించాలని కోరారు. సమావేశంలో ఎంపీడీఓ కుమారస్వామి, ఎంపీఓ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మల్లికార్జునస్వామి విగ్రహ ప్రతిష్ఠ



ఉత్సవాలకు తరలివచ్చిన భక్తులు

ములుగు(గజ్వేల్): మండలంలోని కొట్యాల మల్లన్న ఆలయంలో బుధవారం విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు వైభవంగా నిర్వహించారు. వేద బ్రాహ్మణోత్తముల మంత్రోచ్చారణలు, భక్తుల హర్షధ్వానాల మధ్య నూతన ఆలయంలో శ్రీ మల్లికార్జునస్వామి విగ్రహ, యంత్ర, ధ్వజస్తంభ ప్రతిష్ఠలు ఘనంగా జరిగాయి. ఆలయ వ్యవస్థాపకుడు గంగిశెట్టి గణేశ్‌గుప్తా ఆధ్వర్యంలో ప్రతిష్ఠోత్సవాలు కొనసాగాయి. ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, రాష్ట్ర మెడికల్ సర్వీసెస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఎర్రోల్ల శ్రీనివాస్, ఫుడ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఎలక్షన్‌రెడ్డి, వంటిమామిడి మార్కెట్ కమిటీ చైర్మన్ జహంగీర్, మండల పీఏసీఎస్ చైర్మన్ అంజిరెడ్డి, వైస్ చైర్మన్ నరేశ్‌గౌడ్ తదితరులు ఉత్సవాల్లో భాగస్వాములయ్యారు. ఉత్సవాల్లో పాల్గొన్న భక్తులకు నిర్వాహకులు మహాప్రసాదం అందజేశారు.



హుస్నాబాద్: పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సతీశ్‌కుమార్



దుబ్బాకటౌన్: మాట్లాడుతున్న ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి

ప్రతి నీటిబొట్టు అమూల్యమైంది

హుస్నాబాద్ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్

హుస్నాబాద్: సాగునీటి ప్రాజెక్టులు, చెరువుల ద్వారా సాగునీరు అందించడంతో హుస్నాబాద్ నియోజకవర్గంలో రైతులు పండించిన ధాన్యం దిగుబడిలో రూ.100కోట్ల టర్నోవర్ దాటిందని ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా హుస్నాబాద్ నియోజకవర్గస్థాయి సాగునీటి దినోత్సవ సంబరాలు పట్టణ శివారులోని పోతారం(ఎస్) శుభం గార్డెన్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు. నీటి పారుదల శాఖ ప్రచురించిన మా తెలంగాణ కోటి ఎకరాల మాగానం పుస్తకం, తెలంగాణ నీటిపారుదల శాఖ విధానం పుస్తకాన్ని ఎమ్మెల్యే ఆవిష్కరించారు. అదేవిధంగా హుస్నాబాద్ ప్రాంతానికి చెందిన సీనియర్ న్యాయవాది, రచయిత గులాబీల మల్లారెడ్డి రచించిన ఎద్దు ఎవుసం, సురుకుల వైద్యం అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రం రాకముందు బతుకమ్మలు, వినాయక విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు చెరువుల్లో నీళ్లు లేక ఇబ్బందులు పడ్డారన్నారు. ప్రస్తుతం మిషన్ కాకతీయ పథకం ద్వారా చెరువుల మరమ్మతులతో ప్రతి వర్షపు బొట్టును ఒడిసిపట్టి జలకళను సంతరించుకున్నాయన్నారు. ప్రతి నీటిబొట్టు ఎంతో విలువైనది, అమూల్యమైందన్నారు. భూ నిర్వాసితుల సహకారంతోనే గౌరవెల్లి ప్రాజెక్టును పూర్తి చేసుకున్నామని, ఈ ప్రాజెక్టు ద్వారా 1.06లక్షల ఎకరాలకు సాగునీరందించి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తామన్నారు. సీఎం కేసీఆర్ ఆలోచన విధానంతో సాగునీటి రంగంలో మంచి ఫలితాలను సాధించుకున్నామని, రాష్ట్రంలో ఏ ప్రాంతానికి వెళ్లిన ఏదో ఒక చిన్న, మధ్య తరహా, భారీ ప్రాజెక్టు మన కళ్ల ముందు కనిపిస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో హన్మకొండ జెడ్పీ చైర్మన్ సుధీర్‌కుమార్, సిద్దిపేట అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, సిద్దిపేట జెడ్పీ వైస్ చైర్మన్ రాయిరెడ్డి రాజిరెడ్డి, ఇరిగేషన్ ఈఈలు నారాయణ, రాములు నాయక్, మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత, మున్సిపల్ కమిషనర్ రాజమల్లయ్య, ఎంపీపీలు లకావత్ మానస, మాలోతు లక్ష్మి, జెడ్పీటీసీ మంగ, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రజని, వివిధ మండలాల ప్రజాప్రతినిధులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రాజెక్టులతో తెలంగాణ నంబర్ వన్

ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాకటౌన్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సాగునీటి కోసం ఎన్నో తిప్పలు పడ్డామని రాష్ట్రం ఏర్పడ్డాక అద్భుతమైన ప్రాజెక్టుల నిర్మాణంతో ఎక్కడ చూసిన నీటి సవ్వడులతో పచ్చని పంటలతో సస్యశ్యామలముగా మారిందని ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం దుబ్బాక పట్టణంలోని బాలాజీ గార్డెన్‌లో దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సాగునీటి దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మా తెలంగాణ కోటి రతణాల వీణ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దుబ్బాక నియోజకవర్గంలో 50 టీఎంసీల సామర్థ్యంతో మల్లన్నసాగర్ నిర్మించడంతో పాటుగా కాల్వలను నిర్మించి అన్ని చెరువులను నింపడంతో మండుటెండల్లో సైతం చెరువులు, కుంటలు మత్తడి దూకుతున్నాయన్నారు. దేశంలోనే సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంలో తెలంగాణ నంబర్ వన్ స్థానంలో ఉందన్నారు. రైతులు సంతోషంగా ఉన్నప్పుడే రాజ్యం బాగుంటుందనే సంకల్పంతో ఆ దిశగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం ముందుకెళ్తుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనిత భూంరెడ్డి, ఎంపీపీ కొత్త పుష్పలత కిషన్‌రెడ్డి, పీఏసీఎస్,ఏఎంసీ చైర్మన్లు కైలాస్, జ్యోతి, నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, ఇరిగేషన్ ఉన్నతాధికారులు తదితరులు ఉన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి



కట్కూర్‌లో జీపీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సతీశ్‌కుమార్

అక్కన్నపేట(హుస్నాబాద్): గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ అన్నారు. అక్కన్నపేట మండలం కట్కూర్‌లో రూ.20లక్షలతో నిర్మించనున్న గ్రామ నూతన పంచాయతీ భవనం, రూ.20లక్షలతో ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం నూతన భవన నిర్మాణాలకు టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావుతో కలిసి భూమిపూజ, శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రగతి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. సీఎం కేసీఆర్ ప్రజా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలుచేస్తూ రాష్ట్రాన్ని దేశంలోనే ఆదర్శంగా నిలుపుతున్నారన్నారు. పేదలు, దళితులు, బలహీన వర్గాల జీవన ప్రగతికి వినూత్న పథకాలను చేపట్టామన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ రాయిరెడ్డి రాజిరెడ్డి, ఎంపీపీ మాలోతు లక్ష్మి, జెడ్పీటీసీ మంగ, సర్పంచ్ జిల్లెల అశోక్‌రెడ్డి, ఎంపీటీసీ సుదేష్ణ, ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం చైర్మన్ రాజయ్య, వైస్ చైర్మన్ భూపతి ముకుంద రెడ్డి, ఎంపీడీఓ కొప్పుల సత్యపాల్‌రెడ్డి, ఎంపీఓ కవి కుమార్, పంచాయతీరాజ్ ఏఈ స్నేహ, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పెసరు సాంబరాజు తదితరులు పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయాలి

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లి మండలంలోని మంగోల్ గ్రామంలో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని బుధవారం సర్పంచ్ పుల్లోజు కిరణ్‌కుమార్‌చారి మంత్రి హరీశ్‌రావుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ.. అభివృద్ధే సంక్షేమంగా ప్రభుత్వం పని చేస్తుందన్నారు. పనులు పారదర్శకంగా జరిగేలా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆత్మకమిటీ డైరెక్టర్ లగిశెట్టి కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

అభినందనల వెల్లువ



విష్ణుప్రియను సన్మానిస్తున్న ఎమ్మెల్యే రఘునందన్‌రావు

మిరుదొడ్డి(దుబ్బాక): పట్టుదలతో ఏదైనా సాధించవచ్చని దుబ్బాక ఎమ్మెల్యే మాధవనేని రఘునందన్‌రావు అన్నారు. ఇటీవల నేపాల్‌లో జరిగిన ఇంటర్నేషనల్ కరాటే పోటీల్లో కాంస్య పథకం సాధించిన మండల పరిధిలోని కాసులాబాద్‌కు చెందిన విష్ణుప్రియను బుధవారం ఆయన సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంతర్జాతీయ స్థాయిలో పేరు ప్రఖ్యాతలు సాధించిన విష్ణుప్రియ జిల్లాకే తలమానికంగా నిలిచిందన్నారు. క్రమశిక్షణ కలిగిన ప్రతి ఒక్కరూ విష్ణుప్రియను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఎల్ముల దేవరాజు, రాజయ్య, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **దరఖాస్తుల ఆహ్వానం**

బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకి ఆదర్శ పాఠశాలలో తాత్కాలిక ప్రాతిపాదికన తెలుగు, హిందీ, ఎకనామిక్స్ బోధనకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ హర్జిత్‌కౌర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 6 నుంచి 10 తరగతి వరకు తెలుగు, హిందీ బోధనకు సంబంధిత సబ్జెక్టులలో ఉత్తీర్ణతతో పాటు బీఈడీ పూర్తి చేయాలని, ఎకనామిక్స్ బోధనకు పీజీ, బీఈడీ ఉత్తీర్ణత కలిగి ఉండాలని తెలిపారు. ఆసక్తి గలవారు ఈనెల 12వ తేదీవరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

◆ **పెట్టుబడి సాయానికి దరఖాస్తులు చేసుకోండి**

మద్దూరు(హుస్నాబాద్): కులవృత్తులు చేసుకునే వారు పనిముట్లు, ముడిసరుకు కొనుగోలు చేసుకునేందుకు రూ.లక్ష ఆర్థికసాయం ప్రభుత్వం అందిస్తుందని ఎంపీడీఓ శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఒక కుటుంబంలో ఒకరికి మాత్రమే ఈ పథకాన్ని వర్తింపజేస్తారన్నారు. దరఖాస్తు చేసుకునే వారి వయస్సు 18–55 ఏళ్ల మధ్య ఉండాలి. బీసీ ఆదాయ ధ్రువీకరణ సర్టిఫికెట్ ఉండాలి. ఐదు సంవత్సరాల్లో ప్రభుత్వం నుంచి సబ్సిడీ పొంది ఉండరాదు.అన్నీ కులవృత్తులకు వర్తించును. ఈ నెల 06వ తేదీ నుంచి 20వ తేదీవరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

◆ **8న తేనెటీగల పెంపకంపై సెమినార్**

ములుగు(గజ్వేల్): జాతీయ తేనెటీగల పెంపకం, తేనె మిషన్ (ఎన్‌బీహెచ్‌ఎం)పథకం కింద రైతులు, తేనెటీగల పెంపకందారులకు తేనెటీగల పెంపకం, అత్యాధునిక సాంకేతిక వినియోగం ద్వారా నైపుణ్యాభివృద్ధి పెంపొందించడానికి ఈ నెల 8న ములుగు అటవీ కళాశాలలో సెమినార్ నిర్వహించనున్నట్లు కళాశాల నిర్వాహకులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తేనెటీగల ఉత్పత్తులతో వ్యవసాయం, వ్యవసాయేతర కుటుంబాలకు జీవనోపాధి లభిస్తుందన్నారు. ఆసక్తిగల రైతులు వివరాల కోసం నరేశ్ 9849810511, శశాంక్ 8985972587 నంబర్లను సంప్రదించాలని కోరారు.

◆ **అనారోగ్యంతో మాజీ సర్పంచ్ మృతి**

మిరుదొడ్డి(దుబ్బాక): అక్బర్‌పేట-భూంపల్లి మండల కేంద్రానికి చెందిన మాజీ సర్పంచ్ బొమ్మ నారాగౌడ్ (65) అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. ఉమ్మడి రాష్ట్ర పాలనలో 2006 నుంచి 2011 వరకు భూంపల్లి టీడీపీ సర్పంచ్‌గా గ్రామానికి ఎనలేని సేవలు అందించారు. కాగా రెండు సంవత్సరాల నుంచి ఆయన కేన్సర్ వ్యాధితో బాధపడుతూ చికిత్స పొందుతున్నాడు. ఈ క్రమంలో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆయన బుధవారం తుదిశ్వాస వదిలాడు. పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరితో కలుపుగోలుగా ఉంటూ సౌమ్యుడిగా పేరు సంపాదించుకున్న నారాగౌడ్ మృతితో మిరుదొడ్డి మండలంతో పాటు, అక్బర్‌పేట-భూంపల్లి మండలంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

◆ **10, 11 తేదీల్లో వాలీబాల్ క్రీడాపోటీలు**

మిరుదొడ్డి(దుబ్బాక): ప్రజాహిత ఫౌండేషన్ ఆధ్వర్యంలో మిరుదొడ్డి మంజీరా యూత్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ నెల 10, 11 తేదీల్లో దుబ్బాక నియోజకవర్గ స్థాయి వాలీబాల్ పోటీలను నిర్వహిస్తున్నట్లు మంజీరా యూత్ అధ్యక్షుడు తోట వెంకట్‌రెడ్డి, ప్రజాహిత ఫౌండేషన్ సభ్యుడు స్వామి తెలిపారు. బుధవారం మిరుదొడ్డిలో వారు మాట్లాడుతూ.. ఈ నెల 9వ తేదీలోగా క్రీడాటీమ్‌ల పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. రెండురోజుల పాటు జరిగే క్రీడల్లో పాల్గొనే క్రీడాకారులకు భోజన వసతి కల్పిస్తామన్నారు. ప్రథమ బహుమతి రూ.14 వేలు, ద్వితీయ రూ.10 వేలు, తృతీయ రూ.5000, కన్సోలేషన్ టీమ్‌కు రూ.2500ల నగదుతో పాటు బహుమతులు ప్రదానం చేస్తామని తెలిపారు. వివరాలకు సెల్: 9908693599, 9666354335, 9989385997 నంబర్లలో సంప్రదించాలన్నారు.

◆ **ఉత్సవాలను స్వచ్ఛందంగా బహిష్కరించాలి**

బెజ్జంకి(సిద్దిపేట): ప్రాజెక్టుల పేరుతో పేదల భూములు లాక్కొన్న రాష్ట్రంలో పెరగని సాగుకు నిర్వహించే ఉత్సవాలను ప్రజలు స్వచ్ఛందంగా బహిష్కరించాలని బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు బొనగిరి ప్రభాకర్ పిలుపునిచ్చారు. బెజ్జంకిలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రాజెక్టులతో కోటి ఎకరాల మాగాణీ చేస్తామని కోట్ల రూపాయలు దోచుకున్నారని ఆరోపించారు. ప్రజలకు, రైతులకు ఉపయోగపడని పండగలు ఎందుకన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి రాజమల్లు, మండల అధ్యక్షుడు తిరుపతి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, ఉప్పలేటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

◆ **చేర్యాలను రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలి**

కొమురవెల్లి(సిద్దిపేట): చేర్యాల రెవెన్యూ డివిజన్ సాధనకు మండలంలోని రసులాబాద్ గ్రామ పరిధిలో ఓ ఫామ్‌హౌజ్‌లో వివిధ పార్టీ నాయకులతో కలసి చేర్యాల సాధన సమితి చైర్మన్ చక్రధర్ బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చేర్యాలను ప్రభుత్వం వెంటనే రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలని డిమాండ్ చేశారు. చేర్యాల రెవెన్యూ డివిజన్ సాధించే వరకు పోరాటం కొనసాగుతుందన్నారు. ఉద్యమం ఉధృతం చేసేందుకే మండలాల వారీగా సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

◆ **అభివృద్ధి పనులను పూర్తి చేయాలి**

రాయపోలు(దుబ్బాక): గ్రామంలో కొన్నేళ్లుగా పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులకు నిధులు కేటాయించి పూర్తిచేయాలని దౌల్తాబాద్ మండలం కోనాపూర్ గ్రామస్తులు ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డిని కోరారు. బుధవారం ఎంపీని కలిసిన గ్రామస్తులు ఈ సందర్భంగా అక్కడ అసంపూర్తిగా ఉన్న పంచాయతీ భవనం, డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని కోరారు. అదేవిధంగా గ్రామస్తులకు దళితబంధు పథకం అమలు చేసేలా కృషిచేయాలని కోరారు. ఎంపీని కలిసిన వారిలో మాజీ సర్పంచ్ బాలవ్వ, నాయకులు బాల్‌నర్సయ్య, రాజయ్య, సిద్దయ్య అశోక్ ఉన్నారు.

ఉత్సవాల నిర్వహణపై సర్పంచ్‌ల అసహనం

భోజనం పెట్టలేకపోయామంటూ ఆవేదన



అధికారులతో వాగ్వాదానికి దిగిన చిట్యాల సర్పంచ్ రామ్మోహన్‌రావు

చేర్యాల(సిద్దిపేట): దశాబ్ది ఉత్సవాల నిర్వహణపై మండల పరిధిలోని పలు గ్రామాల సర్పంచ్‌లు అసహనం వ్యక్తం చేశారు. రైతు ఉత్సవాలకు వచ్చిన ప్రజలకు సరిపడా భోజనం పెట్టలేకపోయామని, చెరువు పండగ భోజనాల ఏర్పాటు బాధ్యత మండల అధికారులే తీసుకోవాలన్నారు. గురువారం నిర్వహించే చెరువుల పండగ విషయమై మండలంలోని పలు గ్రామాల సర్పంచ్‌లతో బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ తారిఖ్ అన్వర్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి వచ్చిన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు దశాబ్ది ఉత్సవాల నిర్వహణ విషయంలో అధికారుల తీరుపై ఆవేదన వ్యక్తం చేశారు. ఎంత ఖర్చు అయినా ఉత్సవాలను ఘనంగా జరుపుకోవాలని సీఎం కేసీఆర్ ప్రకటిస్తే స్థానిక అధికారులు మాత్రం సరిపడా నిధులు ఇవ్వడం లేదంటూ చిట్యాల, చుంచనకోట గ్రామాల సర్పంచ్‌లు ఎర్రబెల్లి రామ్మోహన్‌రావు, ఆది శ్రీనివాస్ మండిపడ్డారు. 3 రోజుల క్రితం జరిగిన రైతు దినోత్సవానికి తమకు సమాచారం ఇవ్వలేదని, కార్యక్రమానికి వచ్చిన రైతులకు భోజనం దొరకలేదని, కొన్ని గ్రామాల్లో కేవలం మాంసాహారం పెట్టడంతో శాఖాహారులు ఇబ్బంది పడ్డారని పలువురు వాపోయారు. చెరువు పండగ సందర్భంగా అలా జరగకుండా చూడాలని, రైతు దినోత్సవ వేడుకలు నిర్వహించిన అధికారులే చెరువు పండగ భోజనాల ఏర్పాటు బాధ్యత తీసుకోవాలన్నారు. అవసరమైతే స్థానికంగా ఏర్పాట్లకు సహకరిస్తామని సర్పంచ్‌లు అన్నారు. ఈ విషయంపై స్పందించిన ఎంపీపీ ఉల్లంపల్లి కరుణాకర్, ఎంపీడీఓ తారిక్ అన్వర్ మాట్లాడుతూ.. గ్రామాల్లో సర్పంచ్‌లు, వార్డుసభ్యులు, ఎంపీటీసీల సహకారం ఉంటేనే చెరువు పండగ ఉత్సవాలు విజయవంతం అవుతాయన్నారు. సమావేశంలో ఎంపీఈఓ మహబూబ్‌అలీ, ఐబీ ఏఈ నర్సింహులు, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సంస్కృతి, సంప్రదాయాలకు నెలవు తెలంగాణ

గజ్వేల్‌రూరల్: అభివృద్ధి, సంక్షేమంలో ఆదర్శంగా నిలుస్తూనే సంస్కృతి, సంప్రదాయాలకు తెలంగాణ నెలవుగా మారిందని గజ్వేల్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పీవీ ఉమాశశి పేర్కొన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా కాలేజీయేట్ కమిషనర్ ఆదేశాల మేరకు గజ్వేల్ పట్టణంలోని బాలికల ఎడ్యుకేషన్ హబ్‌లోగల ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బుధవారం విద్యార్థినులకు వివిధ రకాల పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ.. రాష్ట్రంలో అన్ని వర్గాలకు పెద్దపీట వేస్తున్నట్లు తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పీవీ ఉమాశశి ఆధ్వర్యంలో కల్చరల్ కమిటీ కన్వీనర్ శ్రీలత పర్యవేక్షణలో పోటీలను నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు డా.పి.జయరాజు,డా.అనిత, డా.జ్యోతి, సుమలత, ఉమారాణి, సరోజన, నీలిమ, కవిత పాల్గొన్నారు.

పోలీసుల ఆధ్వర్యంలో 5కే రన్



చేర్యాల(సిద్దిపేట): 5కే రన్‌లో సీఐ, ఎస్‌ఐ తదితరులు

చేర్యాల(సిద్దిపేట): దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం పట్టణ కేంద్రంలో పోలీసుల ఆధ్వర్యంలో స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి 5కే రన్ నిర్వహించారు. ఈ రన్‌లో సీఐ సత్యనారాయణరెడ్డి, ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది, పలువురు వ్యాపారులు, యువత పాల్గొన్నారు. అనంతరం సీఐ సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ.. ఆరోగ్యమే మహాభాగ్యమని, ఆరోగ్యం బాగుండాలంటే ప్రతిరోజు యోగ, రన్నింగ్, వాకింగ్, ధ్యానం చేయాలని సూచించారు.

కొమురవెల్లి(సిద్దిపేట): ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతి ఒక్కరూ వ్యాయామం చేయాలని ఎస్‌ఐ చంద్రమోహన్‌యాదవ్ అన్నారు. బుధవారం రన్ ఫర్ హెల్త్ కార్యక్రమాన్ని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. మండల కేంద్రంలోని పోలీస్ బొమ్మ నుంచి కిష్టంపేట వరకు 5కే రన్ నిర్వహించారు.

రెజ్లర్లను వేధించిన ఎంపీని అరెస్టు చేయాలి

సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు



కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న సీఐటీయూ నాయకులు

సిద్దిపేటఅర్బన్: మహిళా రెజ్లర్లను లైంగికంగా వేధింపులకు గురి చేసిన ఎంపీ, డబ్ల్యూఎఫ్‌ఐ అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్‌ను వెంటనే అరెస్టు చేసి, పార్లమెంట్ సభ్యత్వం రద్దు చేయాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు డిమాండ్ చేశారు. బుధవారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ వద్ద కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఎంపీ బ్రిజ్‌భూషణ్‌ను అరెస్టు చేయాలని కోరారు. లేనిపక్షంలో సీఐటీయూ ఆధ్వర్యంలో ప్రజాపోరాటాలు నిర్వహిస్తామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎల్లయ్య, గోపాలస్వామి, ఉపాధ్యక్షురాలు కళావతి, పద్మ, మధు, కోశాధికారి భాస్కర్, సహాయ కార్యదర్శులు రవికుమార్, చంద్రారెడ్డి, మహేశ్ పాల్గొన్నారు.

రాయపోలు(దుబ్బాక): బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషన్‌ను వెంటనే అరెస్టు చేయాలంటూ దౌల్తాబాద్ మండల కేంద్రంలో బుధవారం సీఐటీయూ కార్యకర్తలు నిరసన తెలిపారు. ఆ సంఘం వివిధ రంగాలకు చెందిన కార్యకర్తలు రవి, స్వామి, బాబు, బాల్‌రాజు, లింగం, సత్తయ్య, నర్సింలు, మంజుల, అనిత, సునీత, శ్యామల, ప్రతిభ, ప్రశాంత్, సరోజన ప్లకార్డులు పట్టుకొని నిరసన తెలిపారు.

దుబ్బాక: దుబ్బాక పట్టణంలో సీఐటీయూ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టి బొమ్మను దహనం చేశారు. అనంతరం సీఐటీయూ జిల్లా కోశాధికారి భాస్కర్ మాట్లాడుతూ.. రెజ్లర్లకు న్యాయం జరిగే సీఐటీయూ మద్దతు ఉంటుందన్నారు. కార్యక్రమంలో నాయకులు భాస్కర్, మల్లేశం, రాములు, మంజుల, జ్యోతి, వాసవి, కనకవ్వ ఉన్నారు.

గజ్వేల్‌రూరల్: మహిళా రెజ్లర్లను లైంగికంగా వేధింపులకు గురిచేసిన బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్‌ను వెంటనే అరెస్టు చేయాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎస్‌కే వలీ, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్యలు డిమాండ్ చేశారు. పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా నుంచి ఐవోసీ పక్కన గల మైదానం వరకు యూటీఎఫ్, సీఐటీయూ, ఐద్వా, ఎస్‌ఎఫ్‌ఐల ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టారు.

లీకేజీలకు అడ్డుకట్ట లేదా?

- నీరు వృథాగా పోతున్నా పట్టించుకోని అధికారులు
- నామమాత్రపు చర్యలు చేపడుతున్న వైనం
- శాశ్వత పరిష్కారం చూపాలని రైతుల వేడుకోలు



ఎల్లమ్మ చెరువు రెండో తూమ్ నుంచి వృథాగా పోతున్న నీరు

హుస్నాబాద్: కాలం ఏదైన ఇక్కడి చెరువు తూమ్ లీకేజీల పర్వం కొనసాగుతూనే ఉంటుంది. లీకేజీని శాశ్వతంగా అరికట్టేందుకు అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో చెరువు తూమ్ నుంచి వరద ఏరులై పారుతూనే ఉంటుంది. హుస్నాబాద్ పట్టణంలోని ఎల్లమ్మ చెరువును కాకతీయుల కాలంలో నిర్మించారు. ఈ చెరువు నుంచి దాదాపు 1500 ఎకరాలకు సాగునీరు అందుతుంది. నాలుగు సంవత్సరాల నుంచి వరుణుడు పుణ్యమా అని వర్షాలు సమృద్ధిగా కురుస్తుండటంతో చెరువు నిండుకుండలాగా మారింది. కానీ చెరువు రెండో తూమ్ నుంచి ఏ కాలమైన నీళ్లు వృథాగా పోతున్న పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. అధికారులు ఎన్నిసార్లు మరమ్మతులు చేపట్టిన నీళ్లు ఎక్కడి నుంచి లీక్ అవుతుందో తెలుసుకోలేకపోతున్నారు. ఇప్పటికే ఎల్లమ్మ చెరువును మినీ ట్యాంక్‌గా మార్చేందుకు ప్రభుత్వం రూ.3.50కోట్లు మంజూరు చేసింది. కాంట్రాక్టర్ అలసత్వమో, అధికారుల నిర్లక్ష్యమో ఈ తూమ్ లీకేజీని మాత్రం అరికట్టలేకపోయారు. ఇటీవల ఎల్లమ్మ చెరువు సుందరీకరణ పనులకు పర్యాటక శాఖ నుంచి మరో రూ.3.50 కోట్లు మంజూరయ్యాయి. టెండర్లు కూడా పూర్తి చేయగా పనులు ఇంకా ప్రారంభించలేదు.

నేడు చెరువుల పండగ సంబరాలు..

ప్రభుత్వ ఆదేశాల మేరకు గురువారం ఊరూరా చెరువుల పండగ సంబరాలు నిర్వహిస్తున్నారు. చెరువుల పండగకు అన్ని ఏర్పాట్లు చేశారు. హుస్నాబాద్ పట్టణంలోని ఎల్లమ్మ చెరువు రెండో తూమ్ నుంచి నిరంతరం నీరు లీకేజీ అవుతున్నా నీటిపారుదల శాఖ అధికారులు నామమాత్రపు మరమ్మతులకే పరిమితమయ్యారు. కొన్ని సంవత్సరాల నుంచి తూమ్ ద్వారా నీరు వృథాగానే పోతోంది. తూమ్ గేట్లు పనికి రాకుండా చేశారు. తూమ్‌ల నుంచి పొలాలకు వెళ్లే కాల్వలు ధ్వంసమయ్యాయి. ఓ వైపు మొదటి తూమ్ ద్వారా వెళ్లే కాల్వలు ధ్వంసం కాగా, రెండో తూమ్ నుంచి నీళ్లు లీకేజీ అవుతున్న పరిస్థితి నెలకొంది. అటు తూమ్‌లు పని చేయవు, మరోవైపు కాల్వలు ధ్వంసమై నీళ్లు వెళ్లే పరిస్థితిలేదు. ఇలాంటి తరుణంలో అధికారులు చెరువులు ఎలాంటి ప్రగతిని సాధించాయని పండగలు చేసుకుంటారని రైతులు ప్రశ్నిస్తున్నారు. అధికారులు ఇప్పటికైనా చెరువుల ప్రగతిని చెప్పుకునే ముందు తూమ్‌లు, కాల్వలకు శాశ్వత మరమ్మతులు చేపట్టి రైతులకు అండగా నిలవాలి.



ధ్వంసమైన మొదటి తూమ్ కాల్వలు

చెరువులో నీళ్లు తగ్గాలి..

ఎల్లమ్మ చెరువు రెండో తూమ్ చాలా కాలం నుంచి నీళ్లు లీకేజీ అవుతుండటం వాస్తవమే. చెరువులో నీళ్లు బాగా ఉన్నాయి. ఎక్కడి నుంచి నీళ్లు లీకేజీ అవుతుందో తెలియడం లేదు. ఎన్నోసార్లు ఇసుక బస్తాలు వేసి లీకేజీ కాకుండా ప్రయత్నం చేశాం. నీళ్లు తగ్గితే కాని లీకేజీని గుర్తించడం సాధ్యం కాదు. చెరువు కట్ట మట్టి పనులు జరుగుతున్నాయి. లీకేజీ కాకుండా శాశ్వత పరిష్కారం చేస్తాం. కాలువల మరమ్మతులు కూడా పూర్తి చేస్తాం.

–రాములు నాయక్, ఈఈ ఇరిగేషన్, హుస్నాబాద్